www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 9 డిసెంబర్ 2022
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



జగనన్న కాలనీలకు ఉచిత విద్యుత్ సర్వీసులు

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న విజయానంద్

నెల్లూరు :జగనన్న కాలనీలకు ఉచితంగా విద్యుత్ సర్వీసులు ఇస్తున్నామని, అందులో భాగంగా సర్వీసు వైర్, బోర్డ్ సైతం లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తున్నట్లు ఎపి ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్ తెలిపారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లోని స్కాడా భవనంలో ఎస్‌పిడిసిఎల్, ట్రాన్స్‌కో విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావుతో కలిసి పాల్గొన్నారు. విజయానంద్ మాట్లాడుతూ జగనన్న కాలనీ పనులను వేగవంతం చేయాలన్నారు. చీఫ్ జనరల్ మేనేజర్ లు గురవయ్య, ధర్మజ్ఞాని , చీఫ్ ఇంజనీర్ ట్రాన్స్ కో శ్యామ్ ప్రసాద్ , జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ శ్రీ బి.వెంకట సుబ్బయ్య ,ట్రాన్స్ కో ఎస్. ఈ. శ్రీనివాస్ , ఎస్. ఈ. ప్రాజెక్ట్స్ ట్రాన్స్ కో ఎన్. ఆర్. సి.రెడ్డి, జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కన్స్ట్రక్షన్ ఏ. వి. సత్యనారాయణ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కె.శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ , అకౌంట్స్ ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.

'మాండూస్' తుపాన్ హడల్..!

- ❍నేడు శ్రీహరికోట వద్ద తీరందాటే అవకాశం
- ❍కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ❍మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు
- ❍11వ తేదీ వరకు తీవ్ర ప్రభావం
- ❍తీర ప్రాంతాల్లో అప్రమత్తం



ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

'మాండూస్' తుపాన్ హెచ్చరికలు కొనసాగుతున్నాయి. భారత మెట్రోలాజికల్ డిపార్ట్‌మెంట్ అందించిన సమాచారం ప్రకారం నైరుతి బంగాళాఖాతం మీదుగా సుమారు 470 చేరుకుంది. జాఫ్నా (శ్రీలంక) తూర్పు- అగ్నేయంగా గురు వారం సాయంత్రం వరకు కొనసా గుతోంది. నేడు శ్రీహరికోట-పుదిచ్చేరి మధ్య తుపాన్ తీరం దాటుతుందని వాతావరణ శాఖ హెచ్చ రించింది. జిల్లా వ్యాపితంగా చలిగాలులు వీస్తున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉంది. జిల్లాలోని తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చక్రధర్‌బాబు కోరారు. ఇప్పటికే జిల్లాలోని అందరూ అధికారులను అప్ర మత్తం చేశారు. రెవెన్యూ, పోలీసు, ఇతర అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని ఆదేశించారు. సముద్రతీర ప్రాంతాల్లో వాలంటీర్లు, గ్రామకార్యదర్శులతో కలిసి వేటకు వెళ్లకుండా నిలువరించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం రాత్రికి కారైకాల్‌కు తూర్పు- ఆగ్నేయంగా 530 కిలో మీటర్లు చెన్నయ్‌కి ఆగ్నేయంగా 620 కిమి కేంద్రీకృతమైంది. దీని ప్రభావం వల్ల పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతోంది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి దానికి దగ్గరగ ఉన్న దక్షణ ఎపి తీరం వైపు కదులుతోంది. పుదుచ్చేరి, శ్రీహరికోట మధ్య నేడు అర్ధరాత్రి తీరం దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని కారణంగా 65నుంచి 75 కిలో మీటర్లు వేగంతో గాలులు,ఉరుములతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. గురువారం అర్ధరాత్రి నుంచి 11వ తేదీ వరకు జిల్లా వ్యాపితంగా భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం హెచ్చరించింది. జిల్లాలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల ప్రజలు, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని కలెక్టర్ చక్రధర్‌బాబు కోరారు. వాతావరణ కేంద్రం ద్వార సమాచారం అందుకొని అందుకు అనుగుణంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కేంద్రంలోని 1077 కంట్రోల్ నెంబర్‌కు కాల్ చేయొచ్చునని తెలిపారు.

'మాండూస్'పై అప్రమత్తం : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. మాండూస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితులలో, జిల్లా కేంద్రం లోని 1077 కంట్రోల్ సెంటర్/ మండల తహశీల్దారు కార్యాల యంలో ఏర్పాటు చేశామని, ఆ యా ప్రాంతాలకు సమాచారం అందజేయాలని అధికారులకు సూచించారు.

సిబ్బందికి సెలవులు రద్దు

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రానున్న భారీ వర్షాలకు నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు, సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కమిషనర్ హరిత ఆదేశించారు. ఇప్పటికే సెలవులు పెట్టిన వారు, రెండవ శనివారం, ఆదివారపు సెలవు దినాలను కూడా విధుల నిర్వహణకు సిబ్బందిని ఆదేశిస్తూ అత్యవసర ఉత్తర్వులను కమిషనర్ గురువారం విడుదల చేసారు.

'ఎడిఎఫ్'కు విక్రమ్‌రెడ్డి సన్నాహాలు

10న ప్రత్యేక సమావేశం విద్య, వైద్యం, ఉపాధికి ప్రాధాన్యత

వేగంగా నిర్మాణం జరుగుతున్న బస్టాండ్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

"ఆత్మకూరు డెవలప్‌మెంట్ పోరం" పేరుతో ఆత్మకూరు నియోజకవర్గాన్ని విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పించి రాష్ట్రంతోనే ప్రత్యేక స్థానం కల్పించే దిశగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి సన్నాహాలు చేస్తున్నారు. తన సోదరులు మేకపాటి గౌతమ్‌రెడ్డి మరణానంతరం రాజకీయాల్లోకి వచ్చిన ఆయన "మేకపాటి గౌతమ్‌రెడ్డి" పేరు చిరస్థాయిగా నిలిచేలా పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అందుకోసం ఈనెల 10న ఆత్మకూరులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ప్రత్యక్షంగాను, ఆన్‌లైన్ ద్వార అనేక మంది సూచనలు, సలహాలు తీసుకొని ఆత్మకూరు నియోజకవర్గంలో ఏయే సమస్యలున్నాయి, ఏం చేయాలి, ఏం చేస్తే స్థానిక ప్రజలకు ఉపయోగం ఉంటుందనే విషయాలపై సన్నిహితులు, పారిశ్రామికవేత్తలు, వైద్యులు, జర్నలిస్టులు, ఎన్‌ఆర్‌ఐలతో ప్రత్యేకంగా భేటీ అవుతున్నారు. ఇందుకు ఆత్మకూరులోని శ్రీధర్‌రెడ్డి గార్డెన్ వేదిక కానుంది. నియోజవర్గంలో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. సంగం బ్యారేజీ ప్రారంభోత్సవ కార్యక్రమంలోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇందుకు సంబందించి హామీ ఇచ్చారు. ఇప్పటికే సంగం బ్యారేజీను పూర్తి చేసి, తన సోదరుడు గౌతమ్‌రెడ్డి పేరుతో ప్రారంభం చేయించారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబందించి ప్రభుత్వం నుంచి భారీగా నిధులు రాబట్టారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు, సొంత నిధులతో నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహించి మేకపాటి కుటుంబం పేరు నిలిచిపోయేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. రాజకీయాలకు కొత్త వారైనా తన తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి సూచనలు, సహకారంతో తమను ఎన్నుకున్న ప్రజలకు శాశ్వతంగా ఏదొకటి చేయాలనే ఆలోచన ఉన్నట్లు మీడియాకు తెలిపారు. సుదీర్ఘ కాలం ప్రజలకు గుర్తు ఉండేలా చేయాలని భావిస్తున్నారు. ఇందుకోసం 'ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫారం' ఏర్పాటు చేశారు. ఇదే విషయంలో నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాజకీయాలకు అతీతంగా ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రయివేట్ రంగంలో గల నిపుణులచే ప్రత్యక్ష, పరోక్ష సహాయ సహకారాలు, సూచనలతో ఆత్మకూరు ప్రజల అభివృద్ధికి సమిష్టిగా సహకరించేందుకు అందరూ కలసికట్టుగా సహకరించాలని కోరారు. ఆత్మకూరు నియోజకవర్గం మీదుగా హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరుకు వెళ్లే జాతీయ రహదారులు ఏర్పాటు కావడం ద్వారా నియోజకవర్గంలో లాజిస్టిక్ పార్కు నిర్మించుకోవడంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఎపిలోనే అతి పెద్ద రెండో మండలమైన మర్రిపాడుని అభివృద్ధి చేసేందుకు నిపుణులతో చర్చించనున్నామన్నారు. తన సోదరుడు, కీర్తిశేషులు మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయన ఆశయాలను సాకారం చేసేందుకు ప్రత్యేక కషి చేస్తున్నట్లు వివరించారు. తన అన్న మేకపాటి గౌతమ్ రెడ్డి ఫౌండేషన్ పేరున అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్‌ను అత్యాధునిక హంగులతో మేకపాటి గౌతమ్‌రెడ్డి (ఎంజిఆర్) ఫౌండేషన్ ద్వారా తమ సొంత నిధులు కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. పనులు పురోగతిలో ఉన్నాయన్నారు నియోజకవర్గంలో సోమశిల, ఎఎస్‌పేట, సంగం, చేజర్ల మండలాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి దాదాపు రూ.63 కోట్లకు ప్రతిపాదనలు అందజేశామని, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. మరో జాతీయ రహదారి ఆత్మకూరు నియోజకవర్గంలో మర్రిపాడు, అనంతసాగరం, చేజర్ల మీదుగా కష్ణపట్నం పోర్టుకు వెళ్లేందుకు మంజూరై త్వరలో పనులు ప్రారంభమయ్యే దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఆత్మకూరు పారిశ్రామికంగా వ్యవసాయరంగంగా అభివద్ధి కావడం ఖాయమని అన్నారు. నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకు పెద్ద పీఠ వేయడం ద్వార రాష్ట్రంలోనే ఆత్మకూరు నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా నిలిపేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు.

ఆత్మకూరులో సొంత నిధులతో బస్టాండ్ నిర్మాణం (ఊహచిత్రం)

శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేత

ప్రజాశక్తి -వెంకటాచలం

దశాబ్దాలుగా అపరిష్కతంగా ఉన్న రైతుల భూ సమస్యలు పరిష్కరించి, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత భూ హక్కు కల్పించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉన్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలం మండలం ఎర్రగుంట కమ్యూనిటీ హాలులో గురువారం నిర్వహించిన వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ తో కలిసి సర్వేపల్లి నియోజకవర్గంలోని లబ్ధిదారులకు భూహక్కు పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. వెంకటాచలం, మనుబోలు, పొదలకూరు, తోటపల్లి గూడూరు, ఇందుకూరుపేట, ముత్తుకూరు మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు సూచనలు

ప్రజాశక్తి -కందుకూరు :మండలంలోని కొవ్వూరులో పొగాకు పంట పై పురుగు మందుల వాడకం గురించి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని 26వ వేలం కేంద్రం అధికారులు బుధవారం నిర్వహించారు. వేలం నిర్వహణ అధికారి చైన్‌రామ్‌మీనా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పురుగుమందుల అవశేషాలు ఎక్కువగా ఉంటున్నాయని చెప్పారు. వాటిని అరికట్టాలని కోరారు. ఐటిసి క్రాప్ డెవలప్మెంట్ మేనేజర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ సీటిఆర్‌ఐ వారు సిఫారసు చేసిన మందులనే వాడాలని కోరారు. దీనివలన పొగాకు నాణ్యత పెరిగి అంతర్జాతీయంగా పొగాకు కు డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. జిపిఐ డెవలప్మెంట్ మేనేజర్ యు శ్రీనివాసులు మాట్లాడుతూ పొగాకు గ్రేడింగ్ సమయంలో పొగాకులో పీచులు, గోతం పీచులు, ఇనుప ముక్కలు, ఇతర వ్యర్థ పదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఫీల్డ్ ఆఫీసర్లు వెంకట్రావు ,జి ఉపేంద్ర పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -ఉలవపాడు :మండలంలోని పెదపట్టపుపాలెంలో శ్రీ బంగారమ్మ తల్లి నూతన సుధాబింబ విగ్రహ ప్రతిష్ట, విమాన శిఖర ప్రతిష్టా సంప్రోక్షణ మహోత్సవ కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహిం చారు. కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, పలువురు నాయకులు, పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు.

ఆక్రమణ తొలగింపులో ఉద్రిక్తత..!

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ప్రభుత్వ భూమి ఆక్రమణ తొలగింపులో ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల జోక్యంతో ఆక్రమణదారులు వెనక్కి తగ్గడంతో అధికారులు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొన్నారు. వివరాల మేరకు మండలంలోని నరుకూరు పంచాయతీ పరిధిలోని నీటి పారుదల శాఖకు సంబంధించిన కాలువ పోరంబోకు భూమిని పేడూరుయఅ చెందిన నాసిన పోలయ్య ఆక్రమించాడు. కాలువ కింద వరి సాగు చేస్తున్న రైతులకు బాట సౌకర్యం లేకుండా పోయింది. దీంతో రైతులు తమ ఇబ్బందులను ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఇరిగేషన్ ఏఇ విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగరాజు, డిప్యూటీ ఇంజినీర్ ఎం. అనిల్ కుమార్, విఆర్ఒ సురేంద్ర, సర్వేయర్లు సర్వే చేసి ఆక్రమణను తొలగించేందుకు సిద్ధపడ్డారు. ఈ నేపథ్యంలో ఆక్రమణ దారుడు పోలయ్య భార్య, కుటుంబ సభ్యులు అడ్డు పడ్డారు. దీంతో కృష్ణపట్నం సిఐ వేమారెడ్డి, తోటపల్లిగూడూరు ఎస్ఐ ఇంద్రసేనా రెడ్డి, అక్కడికి చేరుకున్నారు. అక్రమణదారులు అడ్డు తొలగకపోగా రెచ్చిపోయారు. ఈ నేపథ్యంలో పోలీసులకు ఆక్రమణ దారులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం జరిగింది. పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి అక్రమణ దారులను ఘటనా స్థలి నుంచి బయటకు పంపించారు. అధికారులు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని రైతులు అభ్యర్థన మేరకు బాట నిర్మించారు. దాంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. నరుకూరు మాజీ సర్పంచ్ మధు, కానిస్టేబుళ్ళు, మహిళా, సచివాలయం పోలీసులు పాల్గొన్నారు.



పోలీసులతో వాదిస్తున్న ఆక్రమణదారులు

ఇంటూరి పరామర్శ

ప్రజాశక్తి -ఉలవపాడు : ఉలవపాడుకు చెందిన టిడిపి నాయకుడు దార్ల మల్లికార్జున తండ్రి బాల కోటయ్య ఇటీవల మరణిం చారు. దశదినకర్మ గురువారం జరిగింది. కందు కూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు హాజరై బాల కోటయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. మల్లికార్జునను పరా మర్శించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు అంచుపోగు వాసు, పార్టీ నాయకులు వెలిచెర్ల శ్రీను, జంగాల శివప్రసాద్, చింతల సింగయ్య, షేక్ బాజీ, దగ్గుబాటి మాల్యాద్రి, రాసాని కష్ణ, రాచగర్ల శివ పాల్గొన్నారు.

2024 విజయం మాదే..!

నాపై, నా కుటుంబంపై కుట్ర చేస్తున్నారు.. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

విలేకర్లతో మాట్లాడుతున్న రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రజల అభిమానం, అశీస్సులు తమకు మెండుగా ఉన్నాయని, ప్రజలు తమకు అండగా ఉన్నారని నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఐదు సర్వే సంస్థలు సర్వే నిర్వహించాయని అన్ని తమకు అను కూలంగా వచ్చాయన్నారు. ఫలితం తమకు అను కూలంగా వచ్చిందన్నారు. దీనిని చూసి ఓర్వలేని కొందరు ప్రత్యర్థులు తనపై కుట్ర చేస్తున్నారని విమర్శిం చారు. రాజకీయాల్లో ఎవరిని దుర్భాషలాడలేదని, మౌనంగా ప్రజలకు సేవ చేస్తున్నానన్నారు. కొందరు వ్యక్తులు తనపై, తన కుటుంబంపై విష ప్రచారం చేస్తున్నారని, సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీచాతి నీచంగా దుర్భాషాలాడతున్నారని, రెచ్చగొడు తున్నారన్నారు. నన్ను, నా తమ్ముడు గిరిధర్ గురించి మాట్లాడినా రాజకీయాల్లో ఉన్నాం గనుక సహిస్తామని, తన భార్యా, బిడ్డలపైనా పోస్టింగ్‌లు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తే, తన అభిమానులు, సన్నిహితులను రెచ్చగొట్టాలని చూస్తున్నారన్నారు. ఓ పథకం ప్రకారం ఇలాంటి ప్రచారం చేస్తున్నారని, దీని వెనుక ఎవరు ఉన్నారో చెప్పాల్సిన రోజు చెబుతానన్నారు. రూరల్ నియోజవర్గంలో తనతో కలిసి పనిచేసే కార్యకర్తలు, నాయకులు, అభిమానాలు ఎట్టి పరిస్థితుల్లో ప్రత్యర్థులు రెచ్చగొట్టే మాటలకు రెచ్చిపోవద్దన్నారు. ప్రత్యర్థుల కుట్రలే, ఉచ్చులో పడవద్దని కోరారు. రాబోయే రోజుల్లో దూషణలు, ఆరోపణలు మరింత ఎక్కువ చేస్తారని ఎవరు స్పందించొద్దని, ఎవరు మట్లాడ వద్దన్నారు. నేను ఎవరినీ తిరిగి మాట్లాడనన్నారు. విమర్శలు పట్టించుకోకుండా అందరి పనులు చేయాల న్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించే కార్యక్రమాలు చేపట్టాల న్నారు. ప్రజలపై తనకు విశ్వాసం ఉందని, నెల్లూరు రూరల్‌లో ప్రజలు తన వెంటే ఉన్నారని, రాజకీయంగా తనను ఎవరూ ఏమీ చేయలే రన్నారు. ప్రజా క్షేత్రంలో నాకు రాజకీయ ప్రత్యర్థి, పోటీదారులుగానో ఉన్న వారికి ప్రజలే బుద్ధి చెబు తారన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా గుణపాఠం చెబు తారనాన్నరు. 2024లో మూడో సారి మనం ప్రజల అండతో సాధించే విజయమే విమర్శలకు గుణపాఠం అవుతుందన్నారు. రాజకీయాలు చాల మందికి కొత్త అయినప్పటికీ చిన్నప్పటి నుంచి విద్యార్థి, ప్రజా ఉద్య మాలు నిర్వహించానని, ఎవరికి బయప డలేదన్నారు. ఎవరు రెచ్చగొట్టినా అభిమానులు, పార్టీనేతలు, శ్రయోభిలాషులు ఎవరూ రెచ్చిపోవద్దని విజ్ఞప్తి చేశారు.

ప్లే గ్రౌండ్ ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలి

డివైఎఫ్‌ఐ డిమాండ్ - క్రీడల మంత్రి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరిక

మాట్లాడుతున్న డివైఎఫ్‌ఐ నాయకులు

నెల్లూరు :పే అండ్ ప్లే రద్దు చేయాలని, ప్లే గ్రౌండ్స్ ప్రయివేటీకరణ చేసే ఆలోచన విరమించుకున్నట్లు రాష్ట్ర క్రీడల శాఖా మంత్రి రోజా ప్రకటించాలని, ఆ విధంగా ప్రకటించకపోతే జిల్లాలో జరిగే క్రీడా శాఖ మంత్రి రోజా పర్యటనను అడ్డుకుంటామని డివైఎఫ్‌ఐ నాయకులు ప్రకటించారు. గురువారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లోని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎంవి రమణ మాట్లాడుతూ నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్నటు వంటి ఎసి సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో సెటిల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి రావడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేయాలని, క్రీడా మైదానాలను స్టేడియాలను ఇండోర్ స్టేడియాలను స్విమ్మింగ్ పూల్స్ ను జిమ్ కేంద్రాలను యోగ సెంటర్లను ప్రయివేటీకరణ చేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేయాలని ప్లే గ్రౌండ్స్ ప్రైవేటీకరణ ఉపసంహరించుకుంటుందని బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు పి నరసింహ జగదీష్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

ఎం. కోర్ కంపెనీతో

'ప్రకాశం' ఉద్యోగ ఒప్పందం

ఉద్యోగ ఒప్పందం పత్రం అందికుంటున్న కంచర్ల రామయ్య

మాట్లాడుతున్న కంచర్ల విజయ శ్రీనివాస్

ప్రజాశక్తి -కందుకూరు : ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ బ్రాంచ్ డిగ్రీ పొందే ప్రతి విద్యార్థికి తమ కంపెనీ ఉద్యోగ భరోసా ఇస్తుందని ఎం కోర్‌ట్ ప్రతినిధి జి. రఘు వెల్లడించారు. గురువారం కాలేజీలో నాలుగేళ్ల ఇఇఇ విద్యార్థులతో జరిపిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సాఫ్ట్ వేర్ జాబ్స్ కన్నా మెరుగైన జీత భత్యాలతో కోర్ కంపెనీలలో ఈ బ్రాంచి విద్యార్థులకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ఫైనలియర్ విద్యార్థులకు ప్రతి సంవత్సరం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసేలా కాలేజీలో ఒప్పందం కుదుర్చు కున్నట్లు విద్యార్థుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఎలక్ట్రికల్ "బేసిక్స్" లో నైపుణ్యం చూపే ప్రతి విద్యార్థికి ఆఫర్ లెటర్ ఇస్తామని పేర్కొన్నారు. ఫ్రెషర్ గా ప్రారంభ వార్షిక వేతనం 3 లక్షలతో ప్రారంభమై ఉద్యోగ నిర్వహణలో వారి ప్రతిభా పాట వాల మేరకు కోర్ కంపెనీలలో 2 - 3 సంవత్సరాల సర్వీసు పూర్తయ్యేసరికి 7- 8 లక్షల కు చేరుకుంటుందని రఘు వివరించారు. టాటా, జనద్రల్ ఎలిట్రికల్ (జి. ఇ), సిమెన్స్, ఏబిబి, హిటాచి, రిలయన్స్ తదితర కంపెనీలకు అవసరమైన డిజైన్స్ ప్రణాళిక రూపకల్పన చేసి ఇవ్వడం తమ సంస్థ ప్రధాన నిర్వహణగా ఆయన చెప్పారు. ప్రకాశంలో ఫస్ట్ ఇయర్ నుండి ఇఇఇ విద్యార్థి సక్రమంగా అకడమిక్స్ లో నైపుణ్యం సాధిస్తే ఫైనల్ ఇయర్ లో తమ కంపెనీలలో కనీస వార్షిక వేతనం రూపాయలు 3 లక్షల తో ఉద్యోగంలో చేరినట్లేనని భరోసా ఇచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ ప్రకాశం లో ఇంజనీరింగ్ ప్రవేశం అంటే ఉన్నత ప్రమాణాలతో కూడిన డిగ్రీతో ఉద్యోగ పత్రం పొందినట్లేనని పేర్కొన్నారు. ప్రతి బ్రాంచి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నందునే గత ఏడాది 400 కి పైగా ఎంయన్‌సిలలో ఉద్యోగాలు సాధిం చగలిగామని హర్షం వ్యక్తం చేశారు. టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్ కోర్ సెక్టార్ దేనని గుర్తుంచుకోవాలన్నారు. ఏదైనా "కష్టేఫలి"తో కూడుకొని ఉంటుందని స్పష్టం చేశారు. ఏ రంగమైనా కోర్ సబ్జెక్టులే విజయానికి మూల మని స్పష్టం చేశారు. తొలి సంవత్సరం నుండి కోర్సు పైన దష్టి పెడితే విజయం వారిదేనని ఉద్బోధించారు. ప్రకాశం యాజమాన్యం అకడమిక్స్ పై చేస్తున్న కషి అనన్యమని, అయినా బ్యాక్ లాగ్స్ ఉంటున్నాయంటే విద్యార్థుల లోపమేనని గుర్తించమని హితవు చెప్పారు. అకడమిక్స్ ఇంచార్జ్ యస్. యమ్. మీరావలి, సహాయ ప్రొఫెసర్లు యస్. రూప, షరీఫ్, ఏడుకొండలు, ఆరిఫ్ కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు.

దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

నెల్లూరు :పాఠశాలల్లో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు, యాజమాన్యం, నాన్‌టీచింగ్ స్టాఫ్ దురుసుగా ప్రవర్తించరాదని, అందుకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తించినట్లు తన దృష్టికి వస్తే సహించేది లేదని నగర డిఎస్‌పి డి.శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని డిఎస్‌పి కార్యాలయంలో నగరంలోని స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపాల్స్‌తో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ మధ్య కాలంలో వివిధ స్కూల్స్ పై వస్తున్న ఆరోపణల నేపథ్యం లో స్కూలు విద్యార్థినుల రక్షణ కోసం యాజమాన్యాలు తీసుకోవాల్సిన తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి కూలంకషముగా చర్చించారు.. నగరంలోని వివిధ పోలీస్టేషన్ల ఎస్‌ఐలు పాల్గొనాన్రు.

సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి-నెల్లూరు :సిపిఎం పార్టీ 16వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో భారీ వాహనాలు తిరగడం వల్ల స్థానిక ప్రజలు పలు ప్రమాదాలకు గురౌతున్న నేపథ్యంలో భారీ వాహనాలు అటువైపు తిరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం నాయకులు ఆందోళన చేపట్టారు. గురువారం భారీ వాహనం ఓ వాహనదారుడిని ఢీ కొట్టి వెళి పోయింది. ఈ సమాచారం తెలుసుకున్న స్థానిక సిపిఎం నాయకుడు ఆర్ శ్రీనివాసుల ఆధ్వర్యంలో ప్రజలతో రోడ్డు పై బైటాయించి ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో రహదారిపై వాహనాలు నిలిచి పోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు ఆ ప్రాంతానికి హుటాహుటిన చేరారు. నాయకులు మాట్లాడుతూ గతంలో పలు మార్లు ఈ ప్రాంతంలో భారీ వాహనాలు ప్రయాణించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. ప్రజలు ఇబ్బంది పడుతు న్నారని, భారీ బూడిదతో పోయే లారీలు తిరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సిఐ, ఆరో పట్టణ పోలీసులు హామీతో సిపిఎం నాయకులు నిరసన విరమించారు. సిపిఎం నాయకులు స్థానికులు మల్లపు నారాయణ, శ్రీనివాసరావు, మహేష్ ,సంపూర్ణమ్మ ,రాజా, బాబు ,రఘు పాల్గొన్నారు.

కిసాన్ క్రాఫ్ట్ కార్మికుల ఆందోళన

నెల్లూరు :కిసాన్ క్రాఫ్ట్ పరిశ్రమలోని కార్మికులు పరిశ్రమ వద్ద యాజమాన్యం తమ సమస్యలను పరిష్కరించాలంటూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గురువారం పరిశ్రమ ఎదుట లేబర్ చట్టాన్ని అనుసరించి కార్మికులకు 8 గంటల పని విధానం అమలు చేయాలని, కనీస వేతన చట్టం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన చేపట్టారు. ధర్నాలో పాల్గొన్న సిఐటియు జిల్లా అధ్యక్షులు టి వి ప్రసాద్ మాట్లాడుతూ పరిశ్రమంలోని కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, పరిశ్రమ యాజమాన్యం కార్మికులను బానిసలుగా చూస్తూ తొమ్మిది గంటల పాటు పనిచేయించుకోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం యాజమాన్యం చర్చలు జరిపి కార్మికుల ఎనిమిది గంటల పని విధానం కనీస వేతనం అమలు ఉద్యోగ భద్రత తదితర అంశాలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా కార్యక్రమం విరమించి విధుల్లోకి వెళ్లారు. సిఐటియు పొదలకూరు మండల కార్యదర్శి బి .మనోహర్ పాల్గొన్నారు

మహిళలపై హింసను నివారిద్దాం..

నెల్లూరు :రాష్ట్రంలో మహిళలపై లైంగిక వేధింపులు, హింస అంతులేకుండా పెరుగుతుంటే "కంచే చేను మేసిన చందంలా " మహిళలకు రక్షణగా చేసిన చట్టాలు ధనవంతులకు, అధికార పార్టీ నాయకులకు చుట్టాలుగా మారాయని ఐద్వా నాయకులు విమర్శించారు. గురువారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నగర కమిటీ ఆధ్వర్యంలో టౌన్ హాల్ రీడింగ్ రూమ్ లో "మహిళలపై జరుగుతున్న హింసను నిరోధిద్దాం - మహిళల హక్కులు, సాధికారతను సాధిద్దాం" అను అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తలుగా ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బీ, డీకే డబ్ల్యు మహిళా కళాశాల రిటైర్డ్ లెక్చరర్ భారతి, ప్రముఖ రచయిత్రి పాటూరు అన్నపూర్ణమ్మ, ఆదిశంకర స్కూల్స్ డైరెక్టర్ గౌరీ ప్రశంగించారు వక్తలు మాట్లాడుతూ నేడు ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు దాడికి గురవుతున్నారన్నారు. హింస అంతులేకుండా పెరుగుతుంటే "కంచే చేను మేసిన చందంలా " మహిళలకు రక్షణగా చేసిన చట్టాలు ధనవంతులకు, అధికార పార్టీ నాయకులకు చుట్టాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల జరిగే దాడులు నిరోదించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఐద్వా నిర్వహించే పోరాటాలలో మహిళలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐద్వా నగర అధ్యక్షురాలు సుబ్బమ్మ, రూరల్ నాయకులు శంషాద్, అరిగెల రమమ్మ, నగర ఆఫీస్ బేరర్స్ మల్లీశ్వరి,సంపూర్ణ, నాజున్ని, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్‌కె మస్తాన్ బి

అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న రోడ్ల నిర్మాణాలు, డ్రెయిన్ కాలువల అభివద్ధి పనులను అధికారులతో కలిసి కమిషనర్ హరిత గురువారం పరిశీలించారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న దృశ్యం

డాక్టర్ శ్రావణ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

అభిరామ్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కెవి శ్రావణ్ కుమార్ జన్మదిన వేడుకలను ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఆయన అభిమానులు ఆస్పత్రి సిబ్బంది నడుమ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని అభిరామ్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ శ్రావణ్ కుమార్ అభిమానులు స్థానిక మున్సిపల్ బస్టాండ్‌లో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం అభిరామ్ ఆసుపత్రి వద్ద కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి పెద్ద ఎత్తున జన్మదిన వేడుకలు నిర్వహించారు . పలువురు ఆయనకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మాట్లాడుతున్న మేనేజర్ వరప్రసాద్

కళ్లకలక నివారణపై అవగాహన

ప్రజాశక్తి-అల్లూరు

మండల కేంద్రం సచివాలయం-1 పరిధిలోని గాంధీ కాలనీలో గురువారం కళ్లకలక నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ మేనేజర్ వరప్రసాద్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. ఒకవేళ ఈ వ్యాధి ప్రబలితే కళ్లకోడ్, ఐ డ్రాప్స్, వేప ట్యూబులు వాడాలని సూచించారు. దీనిపై ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు నగదు అందజేస్తున్న దృశ్యం

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని కొమరిక గ్రామంలోని గిరిజన కాలనీలో గత రాత్రి అగ్నిప్రమాదం జరిగిన గిరిజన కుటుంబాలకు సింగపూర్ కమ్యూనిటీ అసిస్టెన్సీ వారి సహాయంతో సింగపూర్‌లో నివాసం ఉంటున్న శ్రీ పోచిరెడ్డి దాతృత్వంతో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు పులి చెంచయ్య ఆధ్వర్యంలో రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, నగదు పంపిణీ చేశారు. అనంతరం ఆ కాలనీలోని 25 కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోచిరెడ్డి సురేష్ మాట్లాడుతూ ఈ డిసెంబర్, జనవరి చలికాలంలో నిరుపేదైన గిరిజనులకు తనవంతుగా దుప్పట్లు, అగ్నిప్రమాదంకు గురైన గిరిజన కుటుంబానికి 2 నెలలు సరిపడా నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. పులి చెంచయ్య మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగిన వెంటనే స్థానిక గిరిజన నాయకులు గ్యాలంద చాముండి తెలియజేయడంతో సకాలంలో స్పందించిన సింగపూర్ నివాసి పోచిరెడ్డి సురేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. గిరిజన సంక్షేమ అధికారులకు గౌరవ బిడిఏ పిఐ డాక్టర్ రాణి మందాకు ఈ విషయం తెలిపారు. వారు వెంటనే వారికి సహాయం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక గిరిజన నాయకులు ఎందేటి సురేంద్ర, మణి, నాగరాజు, రాజా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ మస్తాన్‌వలి

సైన్స్ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-సీతారామపురం

ఈ నెల 14వ తేదీన ఆదర్శ పాఠశాలలో జరిగే సైన్స్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంఇఒ మస్తాన్ వలి సూచించారు. గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీతారామపురం, ఒగూరు వారిద్ద పల్లి, అయ్యవారి పల్లి, బసినేనిపల్లె ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పి.సుధాకర్, ఎస్.కొండయ్య, ప్రభాకర్, అంజయ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రెహమాన్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్టు,నిమోనియా సర్వే పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి

సిబ్బంది చేపడుతున్న ఎల్ సిడిసి కుష్టు, నిమోనియా సర్వేను గండిపాలెం పి.హెచ్. సి ఆరోగ్య విద్యాధికారి వెంకటసుబ్బయ్య పరిశీలించారు. గురువారం మండల పరిధిలోని కుర్రపల్లి బిసి కాలనీ ఆరోగ్య సిబ్బంది ఇంటింటి పడుతున్న సర్వేను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పి సర్వేను పకడ్బందీగా నిర్వహించి ప్రతి ఇంటిని సందర్శించి స్పర్శ లేని రాగి రంగు మచ్చలను గుర్తించి, వారి చిరునామాలను పి.హెచ్.సికి అనుమానిత కేసులను పంపించాలన్నారు. 5 సంవత్సరాలలోపు చిన్నారులలో నిమోనియా లక్షణాలైన దగ్గు ,జలుబు ఊపిరి తీసుకోలేకపోవడం , శ్వాస వేగంగా పీల్చుకోవడం పక్క రేటు ఎక్కువగా ఉండటం, తీవ్రమైన జ్వరం ఉండటం ఇతర లక్షణాలు కనిపించిన వారి తల్లులకు అమోక్సిసిలిన్ డిస్పర్సబుల్ టాబ్లెట్లు మూడు రోజులు చిన్నారులకు అందేలా ఆశా కార్యకర్తలు తల్లుల ద్వారా మింగించాలన్నారు. లక్షణాలు తగ్గనిచో వెంటనే పిహెచ్‌సికి పంపాలన్నారు. స్కూల్ హెల్త్‌లో భాగంగా స్థానిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కుష్టు వ్యాధి, నిమోనియా వ్యాధి లక్షణాలు గురించి అవగాహన కల్పించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి స్కూలు ఆయా వంట వ్యక్తులకు తయారీ విధానం పారిశుద్ధ్యం పై అవగాహన కల్పించి చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు గొల్లపల్లి ఎలిషా, ఉపాధ్యాయుని తోట సుభాషిణి, ఎఎన్ఎం చంద్రకళ, ఆశా కార్యకర్త సుభాషిణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారి

పంచాయతీలను అభివృద్ధి చేయాలి



అల్లూరులో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-అల్లూరు

ప్రణాళిక బద్ధంగా గ్రామపంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపిడిఒ శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో జిపిడిపి తయారీ పై 2వ రోజు శిక్షణ తరగతులను నిర్వహించి పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధ్యత కలిగిన ప్రతి ఒక్కరూ అభివద్ధి ప్రణాళికలో పాలు పంచుకోవాలన్నారు. గతంలో ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్‌ను వివిధ పనులకు వినియోగించుకోవడం తెలిసిందేనన్నారు. సర్పంచులు అన్ని శాఖల అధికారులు బాధ్యతతో పంచా యతీల అభివద్ధికి శ్రీకారం చుట్టాలని పిలుపు నిచ్చారు. 15వ ఆర్థిక సంఘం నిధులపై ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారం మేరకు అభివద్ధి జరుగుతుందన్నారు. అంతేకాకుండా జిపిడిపిని అభివద్ధి పరచుకోవడమే మన ప్రధాన లక్ష్యమని తెలియజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మదుల, ఎంపీపీ కుమారి దర్శి గుంట శశిరేఖ, మండల ఉపాధ్యక్షుడు గుమ్మడి సురేంద్ర, ఇఒపిఆర్‌డి పెంచల వీరేంద్ర, పలువురు అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో

ఆత్మకూరు అర్బన్

ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామ ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుందని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు శ్రీ కేత వేణు గోపాల రెడ్డి తెలియజేశారు. గురువారం రెండవ బ్యాచ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం ఈ ప్రణాళికల ద్వారా గ్రామాలు మరింతగా అభివద్ధి చెందుతాయని తెలియజేశారు. ఈ శిక్షణలో పాల్గొన్న ఎంపిడిఒ సి.శ్రీనివాసులు ప్రసంగిస్తూ పంచాయతీ సిబ్బంది సకాలంలో శిక్షణ పొంది అభివద్ధి ప్రణాళికలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ శిక్షణకు వెన్నవాడ, మహిమాలూరు, నువ్వూరుపాడు, పడ కండ్ల పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరిలో మాట్లాడుతున్న అధికారి

ఉదయగిరి

ప్రజా ప్రతినిధులు అధికారుల సమిష్టి కషితో గ్రామాలు అభివద్ధి చేయాలని ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. పంచాయతీలోని గ్రామాల అభివద్ధి ప్రణాళికలో భాగంగా అన్ని శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులకు రెండవ రోజు శిక్షణ కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులతో నిర్వహించారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో మండల స్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ పాల్గొని మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పంచాయతీకి వచ్చే వనరులను సమకూర్చుకొని ప్రణాళిక బద్ధంగా గ్రామ పంచాయతీ అభివద్ధికి అంచనాలను రూపొందించడానికి ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు ఆరోగ్యం పిల్లల స్నేహపూర్వం నీటి సమద్ధి పరిశుభ్రమైన హరిత గ్రామం స్వయం సమద్ధితో మౌలిక సదుపాయాలు సామాజిక న్యాయం భద్రత కలిగి సుపరిపాలన మహిళా స్నేహపూర్వక గా పేదరిక నిర్మూలన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, గ్రామాలకు ఏర్పాటు చేయాల్సిన తదితర మౌలిక వసతులపై అన్ని శాఖల అధికారులు ప్రజా ప్రతినిధుల సమన్వయం తప్పనిసరి అన్నారు. రాబోయే 2023-24 సంవత్సరాలకు అభివద్ధి కార్యక్రమాలను గుర్తించి గ్రామాలను అభివద్ధి బాటలో తీసుకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఉదయగిరి, తిరుమలాపురం, అప్పసముద్రం, దాసరిపల్లి, గుడిపాలెం, వెంగళారవు నగర్, కొండ పాలెం గ్రామ పంచాయితీల సర్పంచులు, ఎంపీటీసీలు సచివాలయ సిబ్బంది ఈ శిక్షణలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఇఒ షేక్ మస్తాన్ వలి, ఎపిఎం ఖాజా రంతుల్లా, ఇఒపిఆర్‌డి మల్లి కార్జున, ప్రజా ప్రతి నిధులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఎస్‌పేటలో మాట్లాడుతున్న అధికారి

ఎఎస్‌పేట

గ్రామ అభివద్ధి ప్రణాళిక పై గుడిపాడు, గుంపర్లపాడు, జమ్మవరం, పందిపాడు, పెద్దబ్బీపురం, అనుమసముద్రం, కుప్పురుపాడు గ్రామపంచాయతీలకు సంబంధించిన సర్పంచులకు, ఎంపిటిసిల సభ్యులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి, గ్రామ స్థాయి అధికారులకు, గ్రామ పంచాయతీ అభివద్ధి ప్రణాళిక పై టిఒటిలు శిక్షణిచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.భాస్కర్, శిక్షకులు ఈఓఆర్ డి ప్రసాద్, శ్రీనివాస రావు, పంచాయతీ కార్యదర్శి ఎజ్దానీ, ప్రతాప్, ప్రసాద్ రెడ్డి, మహమ్మద్ రఫీతో పాటు సర్పంచులు, కార్యదర్శులు, ఫ్రంట్ లైన్ వర్కర్లు పాల్గొన్నారు.

సీతారామపురం

గ్రామాలకు అవసరమైన నిధులను కేటాయించుకుని అభివద్ధిపై దష్టి సాధించాలని ఎంఇఒ మస్తాన్ వలి, ఇఒపిఆర్‌డి భార్గవిలు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2023-24 ఆర్థిక సంవత్సరంనకు సంబంధించి గ్రామ పంచాయతీ అభివద్ధి ప్రణాళిక తయారీ పై మండలంలోని చిన్న నాగంపల్లి, పబ్బులేటి పల్లి,గుండుపల్లి, మారం రెడ్డి పల్లి, సీతారామపురం, సింగారెడ్డిపల్లి, అయ్యవారిపల్లి పంచాయతీలకి సంబంధించి ప్రజా ప్రతినిధులు అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఆర్థిక సంవత్సర నిధులను ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిఆర్ ఎఇ శ్రీనివాస రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జగన్నాధం, డిఆర్‌డిఎ వెలుగు ఏపీఎం సుధాకర్, సీతారామపురం సర్పంచి కొడవటికంటి భాగ్యమ్మ, అధికారులు పాల్గొన్నారు.

సీతారామపురంలో మాట్లాడుతున్న అధికారి

వలేటివారిపాలెంలో మాట్లాడుతున్న అధికారి

వలేటివారిపాలెం

మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో వెలుగు కార్యాలయంలో గ్రామపంచాయతీ అభివద్ధి ప్రణాళికలు తయారీ పై శిక్షణ తరగతులను గురువారం ఎంపీపీ పోనుగోటి మౌనిక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ షేక్ రఫీక్ అహ్మద్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను 2023-2024 సంవత్సరానికి సంబంధించిన గ్రామ పంచాయతీ అభివద్ధి ప్రణాళికలో పొందుపరిచే విధంగా మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలకు వివరించారు. ఈ ప్రణాళికలను సుస్థిరాభివద్ధి లక్ష్యాలు సాధించే దిశగా తయారు చేయాలని, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచే విధానాన్ని సభ్యులందరికీ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లు, ఎంపిటిసి సభ్యులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకు అక్షర చైతన్యం - 2 కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. వాటికి సంబంధించిన పార్టీ పుస్తకాలు గురువారం మండలంలోని బట్టేపాడు సచివాలయం పరిధిలో పంచాయతీ కార్యదర్శి నరసింహులు 15 మంది అభ్యాస కులకు పుస్తకాలను , నోట్ బుక్స్, చాక్ పీస్ లు, పెన్సిళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఉన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

పేకాట రాయుళ్లు అరెస్ట్

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మండలంలోని నూకవరం గ్రామ శివారు పొలాల్లో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సుదర్శన్ గురువారం తెలిపారు. కందుకూరు, పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు గుడ్లూరు సిఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్ఐ, వారి సిబ్బంది కలిసి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పట్టుకొని, వారి వద్ద నుంచి రూ.40,260 స్వాధీనం చేసు కున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

వికలాంగులకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-కావలి

స్థానిక వెంగళరావు నగర్లోని సంయుక్త సేవా సంస్థ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో శుక్రవారం ముసునూరు, వినాయక కాలనీలో పుట్టుకతోనే వికలాంగులుగా రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు, బియ్యం రూ.1200 నగదును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంయుక్త సేవా సంస్థ ద్వారా ఎంతోమంది నిర్భాగ్యులకు సేవలందిస్తున్న సంస్థ సభ్యులకు అభినందనలు తెలిపారు. కొద్ది రోజుల క్రితం దినపత్రికలలో అంకమ్మ రావు, శ్రీనుల గురించి వచ్చిన ప్రత్యేక కథనం చూసి స్పందించి ప్రకాశం జిల్లా, పొదిలి నుంచి కావలికి వచ్చి ఈ చిరు సాయం చేయడం జరిగిందని తెలిపారు. అధికారులు స్పందించి వారికి వికలాంగుల పింఛను వచ్చేలా చేస్తే ఆ కుటుంబానికి ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు.ఇద్దరికి పింఛను రాకపోవడం బాధాకరం అని అన్నారు.సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ అంకమ్మ రావు శ్రీను లో గురించి పేపర్లో చూసి స్పందించి కావలి దాకా వచ్చి వారికి సహాయం చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

లైంగిక హింసను అరికట్టాలి

ప్రజాశక్తి-నెల్లూరు: బాలికలపై జరుగుతున్న లైంగిక హింసను అరికట్టాలని ప్రభత్వాలు చట్టాలను పారదర్శకంగా , ఖఠినంగా శిక్షించేల అమలుపరచాలని రూరల్ ఐద్వా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం మద్రాసు బస్టాండ్ సమీపంలోని సుంకు చెంగన్న బాలికల ఉన్నత పాఠశాలలో రూరల్ ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు మాట్లా డుతూ అపాయకర పరిస్థితులు ఎదురైనపుడు శక్తితో , యుక్తి తోఎవరికి వారు తమను కాపాడుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రూరల్ కమిటీ అద్యక్షురాలు ఎస్ వరలక్ష్మి , సీనియర్ ఐద్వా నాయకులు అరిగెల రమమ్మ , దొడ్ల కౌశల్యమ్మ మహిళా కళాశాల విశ్రాంత లెక్చరర్ భారతీ మేడం , జెవివి మహిళా విభాగ కన్వీనర్ విజయలక్ష్మీ రూరల్ ఐద్వా నాయకులు షంషాద్ విద్యార్థినులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న టిడిపి నాయకులు గూటూరు కన్నబాబు

'హైలెవెల్' పనులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి-మర్రిపాడు

మెట్ట ప్రాంత ప్రజల ఆశ కిరణం సోమశిల హై లెవెల్ కెనాల్ పనులు పూర్తి చేసి మండల ప్రజలకు సాగు, తాగునీరు అందించాలని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళి కన్నబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన గురువారం మండలంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. హై లెవెల్ కెనాల్ నిర్మాణంలో అశ్రద్ధ వహిస్తున్న ప్రభుత్వ అవినీతిని ఎండగట్టారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలో సోమశిల హై లెవెల్ కెనాల్ పనులు నత్త నడకన సాగుతున్నాయన్నారు. కెనాల్ పనులకు 850 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. 670 కోట్ల రూపాయల పనులు పూర్తయ్యాయని, గత ప్రభుత్వం పంప్ హౌస్, చెరువులు, కాలువలు, మోటార్లు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచిందన్నారు. మొదటి పేస్‌లో పడమటి నాయుడు పల్లి లో భూ సేకరణ పూర్తి చేసి నష్టపరిహారం అందించే సమయంలో ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మూడున్నర ఏళ్ల గడిచిన నిర్వాసితులకు నష్టపరిహారం అందించలేక చతికిల పడిందని విమర్శించారు. కమీషన్లు వస్తాయని ప్రభుత్వం వాటి కోసమే పనిచేస్తుంది, కానీ ప్రజల కోసం చేయటం లేదన్నారు. మొదటి పేజ్‌లోని పడమటి నాయుడు పల్లి రిజర్వాయర్ పనులు పూర్తి చేయకుండా పొంగూరు రిజర్వాయర్‌కు నీళ్ల ఎలా వెళ్తాయని ప్రశ్నించారు. మండల టిడిపి నాయకులు అరికట్ల జనార్దన్ నాయుడు, కర్యావుల శ్రీనివాసులు, సీనియర్ నాయకులు ఎలగాల వెంకటేశ్వర్లు యాదవ్, పాలెం పోలయ్య, శాఖ పురం సురేష్ పాల్గొన్నారు.



పంపిణీకి సిద్ధంగా ఉన్న నిత్యావసరాలు

నిత్యావసర సరుకులు వితరణ

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం, నాగులవరం వాస్తవ్యులు కాండ్ర సతీష్ నాయుడు భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో అనాథ బాలలకు 15 వేల రూపా యల విలువ గల నిత్యావసర వస్తువులు మండల విద్యా శాఖ అధికారి జయంతి బాబు అందజేశారు. ఈ సందర్భ ంగా జయంతి బాబు మాట్లాడుతూ కాండ్ర సతీష్ నాయడు దాతత్వం ప్రశంసనీయమని, తన సహాయంతో నెలరోజులపాటు అనాథ బాలలు సంతోషంగా భోజనం చేయడం గొప్పవిషయం అన్నారు.ఆదరణ కేంద్రం డైరెక్టర్ కట్టిపల్లి సింహాద్రి రావు మాట్లాడుతూ సతీష్ నాయుడు ఆదరణ కేంద్రంలో పిల్లలకు దేవుడని ఆయన చేస్తున్న సేవలను సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన జాగతి వేదిక నాయకులు బాపట్ల వెంకటపతి, జయంపు కనకయ్య, మాల మహా సేన జిల్లా నాయకులు పైడి హర్షవర్ధన్, జైభీమ్ సేవాదళ్ వ్యవస్థాపకులు బత్తల రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యం

ప్రజాశక్తి-నెల్లూరు

రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ధాన్యం సేకరణ పై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు సంబంధించి ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతిపక్షానికి చెందిన కొందరు వ్యక్తులు ధాన్యం సేకరణ పై పరిజ్ఞానం లేకుండా మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. కొన్ని పత్రికలు పనిగట్టుకుని ప్రభుత్వంపై బురదజల్లే విధంగా వార్తా కథనాలు ప్రచురిస్తున్నాయని, రైతులు పండించే ప్రతి గింజ ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా కనీస మద్దతు ధర కల్పిస్తుందని హామీ ఇచ్చారు. ధాన్యం సేకరణకు ఎటువంటి లక్ష్యం లేదని స్పష్టం చేస్తూ పత్రికల్లో ప్రకటనలు చూసి రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ఇప్పటికే 13 నుండి 14 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు గణాంక శాఖ లెక్కల ద్వారా తెలుస్తోం దన్నారు. ఈ గణాంకాల వివరాలను రాష్ట్ర మంత్రివర్గానికి కూడా సర్కులేట్ చేస్తున్నామన్నారు.ధాన్యం ఉత్పత్తి పెరుగుతున్నప్పుడు సేకరణ ఎందుకు తగ్గిస్తున్నారని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయన్నారు. అయితే రైతులు పండించిన ధాన్యానికి బహిరంగ మార్కెట్లో గిట్టుబాటు ధర లేకపోతే ప్రభుత్వం జోక్యం అవసరం ఉంటుందని స్పష్టం చేశారు.బహిరంగ మార్కెట్లో ధాన్యానికి గిట్టుబాటు ధర పడిపోకుండా నిలబెట్టడానికి కనీస మద్దతు ధర కల్పిస్తోందన్నారు. జిల్లాలో రెండో పంటగా ఎడగారు పంట ధాన్యాన్ని బాగా వేశారన్నారు. ఏ ఒక్క రైతు కూడా ధాన్యం సేకరణకు ప్రభుత్వం దగ్గరకి రాలేదని అందుకు కారణం వారికి బహిరంగ మార్కెట్లో బాగా ధర లభించడమేనన్నారు. ధాన్యం ఎంత దిగుబడి వచ్చినా దానికి అనుగుణంగా సేకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గతంలో కరువు విలయతాండవం చేయడంతో పంటలు సరిగా పండలేదన్నారు.తమ ప్రభుత్వ హయాంలో కరువు లేదని వర్షాలు బాగా కురిసి జలాశయాలు నిండుకున్నాయన్నారు. పౌరసరఫరాల సంస్థలో 2017 లో పాత రికార్డులు తగలబెట్టారన్నారు. ఆ కాలంనాటి అక్రమాలు వెలుగులోకి వచ్చాయన్నారు. వాటిపై విచారించి నిగ్గు తేల్చడానికి ఏసీబీకి అప్పగించామన్నారు.గత ప్రభుత్వానికి రైతుల పట్ల శ్రద్ధ లేదని మిల్లర్లకు అనుకూలంగా వ్యవహరించిందని చెప్పారు.గత ప్రభుత్వ కాలంలో దళారుల మోసాలు జరిగాయని, జీఓలు రైతులకు ఉపయోగపడటం లేదని వారు తగలబెట్టడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఎక్కడ అవినీతికి చోటు లేకుండా ఈ పంట విధానాన్ని తెచ్చామని నేడు పారదర్శకంగా నియమానుసారంగా రైతు పేరుపై పండించిన పంట ప్రకారం ధాన్యం సేకరణ చేస్తున్నామన్నారు. గతంలో లారీ యజమానులు మిల్లర్లు రైతులను దోచుకునేవారని నేడు తమ ప్రభుత్వం బాధ్యత తీసుకొని వినూత్నమైన విధానంలో రైతులకు అవగాహన కల్పించి దళారులను పక్కనపెట్టి మిల్లర్ల దగ్గర కాకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా దాన్యం సేకరించడం జరుగుతుందన్నారు. వే బ్రిడ్జెలలో తూకాలు వేసుకుంటూ, రవాణా, కూలీల చార్జీలు భరించడంతోపాటు గోనెసంచులు ఉచితంగా అందజేస్తు రైతులకు అండగా ఉంటున్నామన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక 36వ డివిజన్ ప్రాంతంలో ఆత్మకూరు పట్టణంలో నిర్వహించనున్న సిఐటియు జిల్లా 11వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక నాయకులు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఎండి. గయాజ్. కళ్యాణ్. శ్రీ కాంత్. జోగారావు. ఎన్. మాలకొండయ్య టిటిడి కళ్యాణ మండం ప్రాంతంలోని ట్రాలీ ఆటో కార్మికులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి జెండర్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-నెల్లూరు: ఈ నెల 23వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండల, గ్రామ స్థాయిలో డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో జెండర్ క్యాంపైన్ నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ కెవి.సాంబశివారెడ్డి పేర్కొన్నారు. గురువారం డిఆర్‌డిఎ కార్యాలయంలో జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లింగ ఆధారిత , వివక్షత, బాల్య వివాహాలు, లైంగిక నేరాలను, వాటి నుంచి పిల్లల రక్షణ, గృహ హింస, దిశ చట్టం తదితర అంశాలపై సమాఖ్య సభ్యులకు వివరించారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెసే అథారిటీకి చెందిన సి. రాజశేఖర్ రెడ్డి, జి. సుమ , పసల వేణుగోపాల్ తదితరులు చట్టాల గురించి మహిళల చట్టాల పై అవగాహన కల్పించారు. డిఎంఅండ్‌హెచ్‌ఓ విభాగం డెమా అధికారి శ్రీనివాస, ఎస్‌బిసిసి జిల్లా కోఆర్డినేటర్ జె.బాలకృష్ణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించారు. ఎస్ శర్మ, కెజియా, డి.మానస, కె.అంకమ్మ, మరియమ్మ, బి.కామాక్షి, పి.చెన్నయ్య, వి.సుబ్బరాజు, పద్మావతి పాల్గొన్నారు.

కావలి పురపాలక సంఘం
బహిరంగ వేలం ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.390/2019/ఎ1 — **తేది: 07-12-2022**

కావలి పురపాలక సంఘమునకు సంబంధించి సినిమాహాల్ రోడ్డు నందు (వరవ కట్ట పక్కన) గల షాపు నెం.1, 2, 3, 4, 5, 6, 7, 10, 11, 12, 13, 14, 15, 16 షాపులకు అద్దె పద్ధతిపై అద్దెకు ఇచ్చుటకు తేది: 14/12/2022 న ఉదయము గం.11.00 లకు పురపాలక సంఘ కార్యాలయపు ఆవరణలో కమీషనర్ గారిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. సదరు పాటలో పాల్గొనువారు ఈ క్రింది తెలిపిన వాటిని సమర్పించి వేలంపాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.

1. పాటలో పాల్గొనదలచిన వారు రూ.2,00,000/- లు సాల్వేన్సు సర్టిఫికేట్ లేదా సరిసమానమైన మొత్తమును జమచేయవలెను.
2. పాటలో పాల్గొనదలచిన వారు డిపాజిట్ రూ.1,00,000/- లు చెల్లించవలెను.

వేలం పాటలో షాపు పొందిన వారు ప్రతి నెల 5వ తేది లోపల అద్దె + 18% జి.ఎస్.టి. (సర్వీస్ టాక్స్)తో కలిపి ప్రతి నెల చెల్లించవలెను. పాటను ఆమోదించుటకు లేదా ఏ కారణము చూపకనే తిరస్కరించుటకు స్పెషల్ ఆఫీసరు వారికి పూర్తి అధికారము కలదు. మిగిలిన వివరములు ఆఫీసు పని వేళలయందు A1, RI, RO గార్లను సంప్రదించవలసినదిగా కోరడమైనది.

సం/- **కమీషనరు, కావలి పురపాలక సంఘం**